ప్రజాశక్తి
బుధవారం 29 మే 2024
శ్రీకాకుళం

లైంగిక దాడిపై నివేదిక అందించాలి

ప్రజాశక్తి - పొందూరు

పొందూరు మండలం మలకాంలో చిన్నారిపై లైంగిక దాడి ఘటనపై తక్షణ నివేదికను అందించాలని పోలీస్ ఉన్నతాధికారులకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు జారీ చేసినట్లు కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యవహారంపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి, ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిందితుడిని అదుపులోకి తీసుకోవాలని పేర్కొన్నారు. పోలీస్‌శాఖ అందించే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలకు తమ కమిషన్ నుంచి సిఫార్సులు చేయనున్నట్లు తెలిపారు.

నోటా ఎవరికి చేటు..?

- గత ఎన్నికల్లో భారీగా పోలైన ఓట్లు
- టెక్కలిలో మూడో స్థానంలో నోటా
- మిగిలిన నియోజకవర్గాల్లో గణనీయంగా ఓట్లు
- ఈసారి మరింత పెరిగే అవకాశం ఉండొచ్చని అంచనా
- హోరాహోరీ పోరులో గెలుపుపై ప్రభావం

పోటీ చేసిన అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే నన్ ఆఫ్ ది ఎబౌ (నోటా)కు ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం 2013 నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. నోటా అమల్లోకి వచ్చిన తర్వాత 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నోటాకు కొంతమేర ఓట్లు పోలయ్యాయి. అభ్యర్థులు ఇష్టం లేకపోయినా ఓటు హక్కు వినియోగించుకునే చైతన్యం పెరగడంతో, 2019 ఎన్నికల్లో నోటాకు భారీగా ఓట్లు పడ్డాయి. టెక్కలిలో నోటా మూడో స్థానంలో నిలిచింది. మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో నాలుగో స్థానం దక్కించుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో భారీగా పోలింగ్ శాతం నమోదు కావడంతో, నోటాకూ అదే స్థాయిలో ఓట్లు రావచ్చనే చర్చ నడుస్తోంది. అదే జరిగితే హోరాహోరీ పోరు ఉన్న నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపే అవకాశం లేకపోలేదనే అభిప్రాయం వినిపిస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

2019 సార్వత్రిక ఎన్నికల్లో నోటాకు భారీగా ఓట్లు పోలయ్యాయి. 2014 ఎన్నికలతో పోలిస్తే నాలుగు రెట్లకు పైగా పెరిగాయి. 2014 ఎన్నికల్లో 6,576 ఓట్లు పోలయ్యాయి. 2019 ఎన్నికల్లో 27,993 ఓట్లు పడ్డాయి. టెక్కలిలో ఏకంగా నోటా మూడో స్థానంలో నిలిచింది. టిడిపి, వైసిపి తర్వాత నోటాకు 2,929 ఓట్లు వచ్చాయి. మిగిలిన నియోజకవర్గాల్లో నోటా నాలుగో స్థానంలో నిలిచింది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపి కంటే నోటాకే ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. ఎచ్చెర్ల నియోజకవర్గంలో అత్యధికంగా 4,623 ఓట్లు నోటాకు వచ్చాయి. ఆ తర్వాత స్థానంలో పాతపట్నం నియోజకవర్గం ఉంది. ఇక్కడ నోటాకు 4,217 ఓట్లు పోలయ్యాయి.

పార్లమెంట్ నియోజకవర్గంలో నోటాకు 25 వేలకు పైగా ఓట్లు

2019 ఎన్నికల్లో శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గంలో నోటాకు గణనీయంగా ఓట్లు వచ్చాయి. హోరాహోరీగా సాగిన పోరులో స్వల్ప ఆధిక్యంతో టిడిపి అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడు గెలుపొందారు. ఆయనకు 5,34,544 ఓట్లు రాగా, వైసిపి తరుపున పోటీ చేసిన దువ్వాడ శ్రీనివాస్‌కు 5,27,891 ఓట్లు వచ్చాయి. ఇద్దరి మధ్య ఓట్ల వ్యత్యాసం 6,553 ఓట్లు కాగా, నోటాకు 25,545 ఓట్లు పోలయ్యాయి. నోటాకు వేసిన మూడో వంతు మంది వైసిపి వైపు మొగ్గు చూపినా ఫలితం మరోలా ఉండేదన్న అభిప్రాయం వినిపిస్తోంది.

నోటాకు పోలైన ఓట్ల వివరాలు

నియోజకవర్గం	2014	2019
ఇచ్ఛాపురం	845	3,880
పలాస	728	3,044
టెక్కలి	871	2,935
పాతపట్నం	998	4,217
శ్రీకాకుళం	875	3,082
ఆమదాలవలస	586	2,656
ఎచ్చెర్ల	854	4,628
నరసన్నపేట	819	3,491
మొత్తం	6,576	27,993

నోటాకే ఎందుకు?

నోటాకు ఓటు వేయడాన్ని ఒకరకంగా స్వాగతించాల్సిందే. పార్టీ విధానాలు నచ్చలేదనో, ఎవరికి ఓటేస్తే ఏముందిలే అన్న భావనతో ఓటు వేసేందుకు ముందుకు రాని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమే. నోటాకు ఓట్లు అధికంగా పోలవడాన్ని రాజకీయ విశ్లేషకులు అనేక కారణాలను పేర్కొంటున్నారు. పోటీలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న విధానాలతో విసిగి వేశారి ఎవరికీ ఓటేయడానికి ఇష్టపడడం లేదన్న చర్చ నడుస్తోంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ధరలు పెంచడం, ప్రజలపై భారాలు రుద్దడం వంటి విధానాలతో విసిగిన ఓటర్లు నోటా బటన్ నొక్కుతున్నట్లు తెలుస్తోంది. పైగా చాలా నియోజకవర్గాల్లో ప్రధాన రాజకీయ పార్టీలైన టిడిపి, వైసిపి నుంచి 15 నుంచి 20 ఏళ్లుగా వారే పోటీ చేస్తుండడంతో, అభ్యర్థులపై ఓటర్లకు మొహం మొత్తడం కూడా ఒక కారణంగా పలువురు పేర్కొంటున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థుల వ్యక్తిగత చరిత్ర బాగాలేకున్నా నోటాకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలుస్తోంది.



ఈసారి నోటా ప్రభావమెంత!

ప్రస్తుత ఎన్నికల్లో భారీగా పోలింగ్ శాతం నమోదైంది. దీంతో నోటాకూ అదే స్థాయిలో ఓట్లు పడొచ్చనే చర్చ నడుస్తోంది. 2014 నుంచి గణాంకాలను పరిశీలిస్తే, నోటాకు వచ్చే ఓట్ల సంఖ్య క్రమేణా పెరుగుతుండడం ఈ చర్చకు బలాన్ని చేకూరుస్తోంది. జిల్లాలో హోరాహోరీ పోరు ఉన్న నియోజకవర్గాల్లో నోటా ఓట్ల ప్రభావం ఉండవచ్చన్న అభిప్రాయం వినిపిస్తోంది. ప్రధానంగా జిల్లాలో శ్రీకాకుళం, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో టఫ్ ఫైట్ నెలకొందన్న చర్చ నడుస్తున్న నేపథ్యంలో గెలుపోటములపై ప్రభావం చూపవచ్చనే ఆందోళన ఆయా పార్టీల కేడర్‌లో కనిపిస్తోంది. ఇతర నియోజకవర్గాల్లోనూ అభ్యర్థుల మెజార్టీని సైతం తగ్గించే అవకాశాలు లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

- ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డు తప్పనిసరి
- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను శాంతియుతంగా నిర్వహించేందుకు కలసికట్టుగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ లెక్కింపు ప్రక్రియ సూక్ష్మ పరిశీలకులకు సూచించారు. సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియపై స్థానిక అంబేద్కర్ ఆడిటోరియంలో సూక్ష్మ పరిశీలకుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లను లెక్కించే ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకులు నిర్వర్తించే పాత్ర అత్యంత కీలకమన్నారు. ఆరు నెలలుగా ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు రిటర్నింగ్ అధికారుల నుంచి పలు స్థాయిల్లోని అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. ఈనెల 13వ తేదీన పోలింగ్ నాడు కీలకమైన బాధ్యతలు నిర్వర్తించారని చెప్పారు. ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా కౌంటింగ్ దశకు చేరుకున్నట్లు తెలిపారు. మరో కీలకమైన బాధ్యత మిగిలి ఉందన్నారు. జూన్ నాలుగో తేదీన లెక్కింపు కేంద్రాల్లోని ప్రతి టేబుల్ వద్ద ఒక సూక్ష్మ పరిశీలకుని నియమించినట్లు తెలిపారు. నిబంధనల మేరకు సజావుగా లెక్కింపు ప్రక్రియ పూర్తి చేయడానికి సూక్ష్మ పరిశీలకులు కృషి చేయాలని సూచించారు.

పోస్టల్ బ్యాలెట్, ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఇటిపిబిఎస్), ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇవిఎం)లో ఓట్లు, ఓటరు వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్స్ (వివి ప్యాట్స్) ఓటరు స్లిప్పులు లెక్కించాల్సి ఉంటుందన్నారు. వీటిని మైక్రో అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించాలని సూచించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తిస్థాయిలో ఈ మొత్తం ప్రక్రియను వివరించారు. కొన్ని సందర్భాల్లో పరిశీలకులుగా తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వాటికి అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డు తప్పనిసరి అని స్పష్టం చేశారు. శిక్షణా కార్యక్రమంలో నోడల్ అధికారి ఎన్.బాలాజీ, మాస్టర్ ట్రైనర్లు శేషగిరి, మెప్మా పీడీ కిరణ్ కుమార్, ఎల్‌డిఎం సూర్యకిరణ్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, సూక్ష్మ పరిశీలకులు పాల్గొన్నారు.

11న చేపల చెరువు వేలం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎచ్చెర్లలోని జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు విభాగంలో ఉన్న చేపల చెరువు (120 x 90 అడుగులు) ఏడాది కాలానికి వేలం వేయనున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు విభాగంలో జూన్ 11న ఉదయం పది గంటలకు నిర్వహించే వేలంలో తమ వ్యక్తిగత వివరాలు, గుర్తింపు కార్డుతో పాల్గొనాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు రిజర్వు ఇన్‌స్పెక్టర్ (వెల్ఫేర్) కె.వి నాగేశ్వరరావు ఫోన్ నంబరు 6309990841 సంప్రదించాలని సూచించారు.

కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

సార్వత్రిక ఎన్నికల కౌటింగ్‌లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి నియమితులైన కౌంటింగ్ ట్యాబులేషన్ సిబ్బందికి మంగళవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలను రౌండ్ల వారీగా ఎప్పటికప్పుడు నమోదు చేసే సిబ్బంది, వాటిని క్రాస్ చెక్ చేసే మరో బృందం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు వివరాలను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. శిక్షణ అనంతరం అంశాల వారీగా ప్రశ్నలు అడిగారు. నమోదు చేయాల్సిన దరఖాస్తుల గురించి చెప్పారు. శిక్షణ ముఖ్య ఉద్దేశం పారదర్శకంగా శత శాతం ఫలితాలు వెల్లడించేందుకేనన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, మాస్టర్ శిక్షకులు శేషగిరి, ఆయా మండలాలకు చెందిన ఎలక్షన్, సిఎస్ డిటిలు పాల్గొన్నారు.

6 వరకు ఎన్నికల కోడ్

- శాంతియుత వాతావరణంలో కౌంటింగ్
- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్
- కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జూన్ ఆరో తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుపై పోటీ చేసే అభ్యర్థులు, వారి ఏజెంట్లతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు పారదర్శక, శాంతియుత వాతావరణంలో జరగాలన్నారు. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో 14 టేబుల్స్ ఉంటాయని, పోస్టల్ బ్యాలెట్‌కూ మూడు, నాలుగు టేబుల్స్ ఉంటాయన్నారు. అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం ఆరు గంటలకు చేరుకోవాలని, ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రతి ఏజెంట్ పెన్ను, పెన్సిల్, నోట్ ప్యాడ్ తీసుకురావాలన్నారు. రిటర్నింగ్ అధికారులు అనుమతి లేకుండా ఏజెంట్లు ఎవరూ లోపలకు బయటకు వెళ్లరాదని స్పష్టం చేశారు. సర్వీస్ ఓటర్ల ఇటిపిబిఎస్ ఓట్లను జూన్ నాలుగో తేదీ ఉదయం ఎనిమిది గంటల వరకు వచ్చిన వాటిని లెక్కింపునకు తీసుకుంటారని తెలిపారు. ఇటిపిబిఎస్ ప్రీ కౌంటింగ్‌కు ఒక ఏజెంట్‌ను పెట్టుకోవచ్చన్నరు. ఇవిఎంల స్ట్రాంగ్‌రూమ్ సీల్స్‌ను అభ్యర్థులు ప్రతిరోజూ పరిశీలించుకోవచ్చన్నారు. ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం స్ట్రాంగ్‌రూమ్ నుంచి శివానీ ఇంజినీరింగ్ కళాశాలకు పోస్టల్ బ్యాలెట్‌లను తరలించనున్నట్లు తెలిపారు. ఆ సమాచారం అభ్యర్థులందరికీ ముందుగా తెలియజేస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ తరలింపు సమయంలో అభ్యర్థులు రావచ్చని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాటర్ బాటిళ్లు, ద్రవ పదార్థాలు, తదితర నిషేధిత వస్తువులను అనుమతించబోమని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో ఏ ఒక్క వాహనానికీ ప్రవేశం లేదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అందరూ సహకరించాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. కౌంటింగ్ కేంద్రమైన శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో పటిష్టమైన మూడంచెల భద్రతా ఏర్పాట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బలగాలతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కౌంటింగ్ రోజున గానీ, తర్వాత గానీ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. గ్రామాల్లో ఏ విధమైన అల్లర్లు, గొడవలు సృష్టించకూడదని, నిరంతర నిఘా ఉంటుందని తెలిపారు. క్విక్ రియాక్షన్ టీమ్‌లు నియోజకవర్గానికి మూడు చొప్పున ఉంటాయన్నారు. సోషల్ మీడియాలో ఎటువంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు పోస్టింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ రోజున డ్రై డేగా పరిగణించి మద్యం అమ్మకం గానీ, సేవించడం గానీ చేయరాదని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టులు, సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శివానీ ఇంజినీరింగ్ కళాశాల మెయిన్ ద్వారం గుండా ఎవరికీ ప్రవేశం లేదన్నారు. శివానీ కళాశాల వెనుక వైపు నుంచి పార్కింగ్, ప్రవేశానికి ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. జూన్ ఆరో తేదీ వరకు కోడ్ అమల్లో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలు, సభలు, బాణసంచా, సామగ్రి వాడకానికి అనుమతి లేదన్నారు. కోడ్ ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. రెచ్చగొట్టే మాటలు, పోస్టింగ్‌లు ఉండరాదని, శాంతియుత వాతావరణంలో ఉండాలన్నారు. ఆమదాలవలస రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ కౌంటింగ్‌పై ఏజెంట్లు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏ నియోజకవర్గానికి వెళ్లాలో సైనేజ్ బోర్డులు క్లియర్‌గా ఉన్నట్లు చెప్పారు. ఒక నియోజకవర్గం ఏజెంట్లు వేరే ఏజెంట్ల దగ్గరకు వెళ్లరాదని స్పష్టం చేశారు. సమావేశంలో టెక్కలి రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, అదనపు ఎస్‌పి ప్రేమ్ కాజల్, రిటర్నింగ్ అధికారులు సుదర్శన్ దొర, భరత్ నాయక్, అప్పారావు, సిహెచ్.రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహనరావు, డిఎస్‌పిలు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు పేరాడ తిలక్, ధర్మాన కృష్ణదాస్, మామిడి గోవిందరావు, ఇండిపెండెంట్ అభ్యర్థులు, ఏజెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

2న మోడల్ లాసెట్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ బిసి న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యాన జూన్ రెండో తేదీన మోడల్ లాసెట్‌ను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.ఉమా మహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు తెలిపారు. నగరంలోని ఎంపిఆర్ లా కళాశాలలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండో తేదీన శ్రీకాకుళం నగరంలోని ఎంపిఆర్ లా కళాశాలలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదేళ్లుగా మోడల్ లాసెట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మోడల్ లాసెట్ ఐదేళ్లు, మూడేళ్లు లా కోర్సులు చదవాలనుకునే అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 96407 80728 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు. ఎంపిఆర్ లా కళాశాల ప్రిన్సిపాల్ కె.మోషే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ బిసి న్యాయవాదుల అసోసియేషన్ కృషి అభినందనీయమన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో న్యాయవాదులు కొమ్ము రమణమూర్తి, ఇద్ది పాపయ్య, పైడి జోగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రథమ చికిత్సపై అందరికీ అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన ప్రథమ చికిత్స శిక్షణా కార్యక్రమాన్ని రెడ్‌క్రాస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో జిల్లా నలుమూలల నుంచి 30 మంది పాల్గొన్నారని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న ప్రతిఒక్కరూ ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. డాక్టర్ శ్రీకాంత్, ట్రైనర్ జి.రమణ ప్రథమ చికిత్స, ప్రమాద సమయంలో క్షతగాత్రులను తరలించే పద్ధతి, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రథమ చికిత్స పద్ధతులను వివరించారు. అనంతరం శిక్షణలో ఉత్తీర్ణులైన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కార్యర్శి బి.మల్లేశ్వరరావు, కోశాధికారి కె.దుర్గా శ్రీనివాస్, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల గుండెచప్పుడు ఎన్‌టిఆర్

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత కీర్తిశేషులు నందమూరి తారక రామారావుకే దక్కుతుందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎన్‌టిఆర్ 101వ జయంతిని పురస్కరించుకుని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాశిలో కుటుంబసభ్యులతో కలిసి ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సినీ రంగంలో విశ్వ విఖ్యాత నటుడిగా పేరుగాంచిన ఎన్‌టిఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారాన్ని చేపట్టారని గుర్తుచేశారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పలు పథకాలను ప్రవేశపెట్టి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. రాజకీయాలకు కొత్త అర్థం చెప్తూ, పరిపాలనలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చి సరికొత్త శకానికి నాంది పలికారని కొనియాడారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల అధ్యక్షులు బోయిన రమేష్ ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పూజారి శైలజ, వి.విజయలక్ష్మి, కామేశ్వరరావు, ఎన్.శ్రీనివాస్, జి.లక్ష్మణరావు, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు

మాట్లాడుతున్న డిఇఒ వెంకటేశ్వరరావు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

ప్రజాశక్తి - ఆమదాలవలస

విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఉన్న మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం పెట్టాలన్నారు. మధ్యాహ్న భోజనం తినే విధంగా రుచికరంగా తయారు చేయాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారి జి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి పోషక విలువలతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఆహ్లాదంగా ఉండేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో సిఎంఒ పి.ప్రభాకర్, ఎంఇఒ-2 టింగరాజు, సిఆర్ఎంటిలు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఢిల్లీశ్వరరావు

మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు పతకాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మార్షల్ ఆర్ట్స్ ఆత్మరక్షణకు దోహదపడుతుందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలని కరాటే చీఫ్ రెడ్డి ఢిల్లేశ్వరరావు సూచించారు. నగరంలోని మహాలక్ష్మీనగర్ కాలనీలో ఉన్న కెన్యూ రియో కరాటే విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. విజయనగరం రాజీవ్ క్రీడా ప్రాంగణం ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో సత్తా చాటి పతకాలను దక్కించుకున్నారు. కెన్యూ రియో విద్యార్థులు కటా, కుమిటే విభాగాల్లో ఈ పతకాలను కైవసం చేసుకున్నారన్నారు. ఇందులో స్వర్ణం 26, రజతం 19, కాంస్యం పతకాలు ఉన్నాయన్నారు. ఎపి కరాటే చీఫ్ కె.సుమన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను ,పతకాలు అందజేశారు.

మాట్లాడుతున్న అప్పారావు

ఆటపాటలతో అలరించిన చిన్నారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వేసవి సెలవుల్లో చిన్నారులకు పుస్తకాల్లో లేని పరిజ్ఞానం అందించడం ద్వారా వారిలో సృజనాత్మకతను వెలికి తీయాలన్న లక్ష్యంతో క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ వేసవి వినోద కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో క్లబ్ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పూర్వ డిప్యూటీ డిఇఒ కొట్టకోట అప్పారావు, క్లబ్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు, వేగివాడ పాల్గొన్నారు. ఆటపాటలతో సందడిగా సాగిన ఈ కార్యక్రమంలో మనసుకు నచ్చిన రీతిలో కొత్త అంశాలు తెలుసుకోవాలన్న ఆసక్తి చిన్నారులు కనబరిచారు.

ప్రశాంత వాతావరణం కల్పించాలి

ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న జరగనున్న కౌంటింగ్ సందర్భంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్‌దొర పోలీసులకు సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ పోలీసు అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఎక్కడా ఎటువంటి గొడవలు, తగాదాలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. గ్రామాల్లో, వార్డుల్లో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని. సమావేశంలో సిఐలు, టి.ఇమ్మాన్యుల్‌రాజు, మల్లే శ్వరరావు, ఎస్ఐలు సత్యనారాయణ, లక్ష్మణరావు, రాము పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న సుదర్శన్‌దొర

బడుగుల ఆశాజ్యోతి ఎన్‌టిఆర్

శ్రీకాకుళం అర్బన్ : కేక్‌ను కట్ చేస్తున్న వెంకటరమణ

ప్రజాశక్తి - కవిటి

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి నందమూరి తారక రామారావు అని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి అభిమానులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ జానపద, పౌరాణిక, సాంఘిక సినిమాలతో అశేష ప్రజాదరణ పొందిన ఎన్‌టిఆర్ రాజకీయాల్లో సామాజిక ప్రక్షాళన చేసిన మహనీయుడని కొనియాడారు. ముఖ్యంగా రూపాయికే కిలో బియ్యం పథకంతో పేదల కడుపునింపిన పేదల పక్షపాతని కొనియాడారు. ఈ సందర్భంగా జోహార్ ఎన్‌టిఆర్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మణిచంద్ర ప్రకాష్, సీపాన వెంకటరమణ, పొందర కృష్ణారావు, బెందాళం రమేష్, ఆరంగి మధు, బెందాళం విజయ్, బాసు దేవ్ రౌలో, సంతోష్ పట్నాయక్, బెందాళం తిరుమల, రంగా రౌలో, పుల్లట సంతోష్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, శ్రీకాకుళం టిడిపి అభ్యర్థి గొండు శంకర్‌లు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. అనంతరం నగరంలోని బెహరా మనో వికాస కేంద్రంలో అనాథలకు అల్పాహారం అందజేశారు.

అలాగే ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా నందమూరి మోక్షజ్ఞ అభిమాన సంఘం అధ్యక్షులు మాధారపు డేవిడ్ 101 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో శిబిరంలో బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్ సభ్యులు సురేంద్ర, దుర్గ, మోహన్, సురేష్, ప్రసాద్, రాజు, మహేష్, జనార్ధన్, రాజేష్, సతీష్ పాల్గొన్నారు.

అలాగే ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా తెలుగు రచయితల వేదిక సాంస్కృతిక కమిటీ, శ్రీనివాస నాట్య మండలి సంయుక్తంగా భూకైలాష్ నాటకాన్ని ప్రదర్శించారు. నగరంలోని శాంతి నికేతన్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈ ప్రదర్శనకు కిమ్మి సంతోష్ దర్శకత్వం వహించారు. ఈ ప్రదర్శనలో రావణుడు పాత్ర సంతోష్, శివుడు పాత్రలో గాంధీ, విభీషనుడు పాత్రను బోగెల ఉమామహేశ్వరరావు, నారదుడుగా చాడ శ్రీనివాస్, శుక్రాచార్యులుగా ఐ.ఎన్.డి.ప్రసాద్ ప్రదర్శించారు. అంతకుముందు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఆమదాలవలస : టిడిపి కార్యాలయ ఆవరణలో ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, మున్సిపల్ మాజీ వైస్‌చైర్‌పర్సన్ కూన వెంకట రాజ్యలక్ష్మి, మొదలవలస రమేష్, నూక రాజు పాల్గొన్నారు.

పోలాకి : స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నందిగాం: స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి మండల పార్టీ అధ్యక్షులు అజయ్ కుమార్. మల్ల బాలకృష్ణ, వాళ్ల చంద్రశేకరరావు, సబి జానకిరామ్, ఎం.లోకనాథం, ప్రసాదరావు, ఎ.కూర్మారావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఇచ్ఛాపురం : టిడిపి కార్యాలయంలోని ఎన్‌టిఆర్ చిత్రపటానికి టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, లీలారాణి, దక్కత ఢిల్లీరావు, నందిక జాని, కొండ శంకరరెడ్డి, రెయ్య జానకీరావు, కాళ్ల జయదేవ్, ఉనా సంతోష్, జన్నల సంతోష్, శ్రీనివాస్ సాహు, గిన్ని బాలరాజు, దక్కత కామేశ్వరరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

లావేరు : మండలంలోని బెజ్జిపురంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పిన్నింటి మధుబాబు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో విజయనగరం బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజ్జడ శ్రీనివాసరావు, ఇజ్జడ అప్పారావు, మాజీ సర్పంచ్ ఇజ్జడ ఉత్తరలక్ష్మి, గంట్యాడ అప్పలనాయుడు, మాజీ ఎంపిపి పిన్నింటి భానుమతి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పిన్నింటి శ్రీదేవి ఒడ్డుపల్లి శ్రీనివాసరావు, ఆజార్ పాల్గొరు.

నౌడప : కోటబొమ్మాళి టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి టిడిపి మండల అధ్యక్షులు జీరు భీమారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

రణస్థలం రూరల్ : ఎన్ఇఆర్ క్యాంప్ కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి ఎన్‌డిఎ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పలాస : స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ మంత్రి గౌతు శివాజీ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా, సవర రాంబాబు, దడే నర్సింహులు, వంకల కూర్మారావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

పొందూరు : స్థానిక టిడిపి కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి చినరంగా, కాలెపు శ్రీనివాసరావు, పైడి వాసు, తవిటినాయుడు, భవానీ, శ్రీను పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని వజ్రపుకొత్తూరు, అక్కుపల్లి గ్రామాల్లో ఎన్‌టిఆర్ విగ్రహాలకు టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు సూరడ మోహనరావు, కొనారి కిరణ్‌కుమార్, బత్తిని మోహనరావు, లైశెట్టి భీమారావు, కోనేరి ఆదినారాయణ, పోతనపల్లి సాంబమూర్తి, కొంచాడ మోహనరావు, తమాడ ప్రదీప్, చలపతి పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి, మహిళా అధ్యక్షులు మెండ దమయంతి ఎల్.ఎల్.నాయుడు, హనుమంతు రామకృష్ణ, చాపర గణపతి, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, మట్ట పురుషోత్తం, కోళ్ల లవకుమార్, బసవల అప్పలస్వామి, రెయ్యి ప్రీతీష్‌చంద్, దల్లి ప్రసాద్‌రెడ్డి, గండి చంద్రరావు, జీరు వెంకటరెడ్డి, బెహరా కాళీ, పేర మురళి పాల్గొన్నారు.

పలాస : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ఆమదాలవలస : కేక్‌ను కట్ చేస్తున్న రవికుమార్

కవిటి : విగ్రహం వద్ద నివాళలర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్

లావేరు : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న టిడిపి నాయకులు

అభ్యర్థుల ఖర్చులు ఇవే...

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి నియోజకవర్గంలో ఈ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోటీ చేసిన ఏడుగురు అభ్యర్థులు తమ ప్రచారల్లో చేసే ఖర్చులను అందించారు. అభ్యర్థులు నామినేషన్ వేసినప్పటి నుంచి పోలింగ్ తేదీ వరకు ఖర్చుల వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్‌కు మంగళవారం అందజేశారు. టిడిపి అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు రూ.18,44,640, వైసిపి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ రూ.25,67,021, కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కిల్లి కృపారాణి రూ.6,76,778, బిఎస్‌పి అభ్యర్థి చింతాడ శ్రీనివాసరావు రూ.86,440, జైభీమ్ పార్టీ అభ్యర్థి బైపల్లి పరమేశ్వరరావు రూ.95,985, స్వతంత్ర అభ్యర్థి గెడ్డవలస రాము రూ.1,54,280, మరో స్వంతంత్ర అభ్యర్థి అట్టాడ రాజేష్ రూ.79,469 తమ ఎన్నికల ప్రచారంలో వెచ్చించినట్లు వెల్లడించారు.

హర్షవల్లి లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజంలో నిస్వార్ధ సేవలకు ఎప్పుడు గుర్తింపు ఉంటుందని, అందులో భాగంగానే లయన్స్‌క్లబ్ హర్షవల్లి సేవలను మరింత విస్తృతం చేస్తామని చైర్మన్ కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్ అన్నారు. నగరంలోని గాంధీనగర్‌లోని లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి కార్యాలయంలో స్టార్ వాకర్స్ ఆధ్వర్యాన లయన్స్ క్లబ్ ప్రతినిధులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు పదవులు హర్షవల్లి క్లబ్‌కు రావడం గర్వకారణమన్నారు. జోనల్ చైర్మన్‌గా శోభారాణి మాట్లాడుతూ క్లబ్ ఏర్పాటు చేసిన అనతి కాలంలోనే గుర్తింపు లభించిందన్నారు. అధ్యక్షులు వావిలపల్లి జగన్నాథనాయుడు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా సేవాభావం, దాతృత్వ స్వభావం అలవర్చుకోవచ్చన్నారు.

ప్రశంసాపత్రాలతో క్లబ్ సభ్యులు

అనంతరం వారిని వాకర్స్ దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ గవర్నర్ పొట్నూరు గోవింద గుప్తా, శాసపు జోగినాయుడు, గేదెల ఇందిరాప్రసాద్, రవిశంకర్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, తర్లాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్ కలకలం

పలాస : పలాసకు చెందిన జీడి కార్మికురాలు సిర్ల కరుణ కుమారుడు కుమారస్వామి పదేళ్ల బాలుడిని అపహరించడానికి గుర్తుతెలియని వ్యక్తి యత్నించాడు. బాలుడు కేకలు వేయడంతో ఆయన పలాయనం చిత్తగించాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బాలుడి తల్లి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం స్థానిక రాజమ్మ కాలనీలో నివాసం ఉంటున్నారు. కుమారస్వామి తల్లి కరుణ జీడి కార్మికురాలిగా చేస్తున్నారు. తల్లిని కలుసుకునేందుకు సమీపంలోని జీడి పరిశ్రమకు వస్తున్నాడు. ఈ క్రమంలో దారిలో ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి ఆయనను తన తోపాటు తీసుకెళ్లాడు. రైల్వేస్టేషన్ సమీపానికి వెళ్తుండగా బాలుడు భయపడుతూ కేకలు వేశారు. దీనిని గమనించిన వాహనచోదకులు ఆయనను ప్రశ్నించే ప్రయత్నం చేశారు. దీంతో ఆ వ్యక్తి బాలుడిని అక్కడే విడిచి పలాయనం చిత్తగించాడు. అనంతరం బాలుడిని స్థానికులు వివరాలు అడిగి తెలుసుకొని తల్లి చెంతకు చేర్చడంతో కథ సుఖాంతమైంది. ఈ వ్యవహారం అంతా వ్యాపించడంతో తల్లిని పరామర్శించేందుకు తోటి కార్మికులు వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై తాము పోలీసులకు ఫిర్యాదు చేయలేదని బాధిత కుటుంబం సభ్యులు తెలిపారు.

లైంగిక దాడిపై కేసు నమోదు

పొందూరు: మండలంలోని మలకాంలో మక్కుపచ్చులారని చిన్నారిపై జరిగిన లైంగికదాడి కేసులో చిన్నారి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన వి.గణపతిపై పోక్సో చట్టం కింద మంగళవారం కేసును నమోదు చేసినట్లు ఎస్ఐ వై.రవికుమార్ తెలిపారు. ఆదివారం చిన్నారికి వరుసకు చిన్నాన్న అయిన గణపతి మామిడిపండు ఇస్తానని ఆశ చూపించి చిన్నారిపై లైంగికదాడికి పాల్పడినట్లు సోమవారం రాత్రి తల్లి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. చిన్నారిని వైద్య పరీక్షలు నిమిత్తం శ్రీకాకుళం ప్రభుత్వాస్పత్రికి తరలించామని తెలిపారు. ఘటన అనంతరం పరారైన గణపతి ఆచూకీని కనుగొని అరెస్టు చేయాల్సి ఉందని ఎస్ఐ పేర్కొన్నారు.

నాటుసారా సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

బెల్లం ఊటలు ధ్వంసం

మెళియాపుట్టి: మండలంలోని రింపి గ్రామంలో టెక్కలి సెబీ ఎన్‌ఫోర్స్‌మెంట్, పలాస టిడిఎఫ్ సిబ్బంది ఆధ్వర్యాన మంగళవారం సారా తయారీ స్థావరాలపై మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అనంతరం 45 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో సెబీ సిఐ జి.రాజశేఖర్‌నాయుడు, డిటిఎఫ్ సిఐ రామచంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స కంటే జాగ్రత్తలు మేలు

కోటబొమ్మాళి: సకాలంలో సీజనల్‌గా వ్యాప్తి చెందే రోగాలకు ముందుగానే వాటికి సంబంధించిన నివారణా టీకాలు వేస్తే పశువులకు వ్యాధి బారిన పడకుండా చేయడం మేలని జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ వంగపాటి జయరాజు అన్నారు. స్థానిక పశువైద్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సహాయ సంచాలకులు మందా లోకనాథం, పశువైద్యాధికారులు డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్, ఎం.ప్రజ్ఞచైతన్యలతో సమీక్షించారు. మండలంలో జరుగుతున్న జబ్బువాపు, చిటుక వ్యాధి నివారణ టీకాలు ఎంటిరోటాక్సెమియా మాట్లాడారు. వచ్చే ఏడాది నుంచి ఆర్‌బికెలకు నెల వారీగా లక్ష్యాలు నిర్ణయించామని అన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న జయరాజు

సంక్షిప్త వార్తలు

రుచికరంగా వండాలి

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం వంటకాలు రుచికరంగా వండి విద్యార్థులకు అందించాలని టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి విలియమ్ సూచించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావుల పర్యవేక్షణలో మధ్యాహ్న భోజనం పథకం వంట కార్మికులకు మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు అందించే పౌష్టికాహారం నిర్వహణలో ఎటువంటి అలక్ష్యం వహించవద్దని అన్నారు. మెనూలో అమలుజేసే వంటకాల తయారీపై చర్చావేదిక నిర్వహించి సందేహాలను నివృత్తి చేయించారు. అనంతరం పదార్థాల తయారీపై పిపిటి రూపంలో వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లుగా బమ్మిడి ఖగేశ్వరరావు, వి.లక్ష్మి వ్యవహరించారు. కార్యక్రమంలో సిఆర్‌ఎంటిలు, మండల రిసోర్స్ సిబ్బంది రవిబాబు, సంతోష్, ధర్మారావు, రాంబాబు పాల్గొన్నారు.

'108' పరిశీలన

నందిగాం: మండల 108 అంబులెన్స్‌ను డివిజనల్ ఆపరేషన్ అధికారి జి.జగన్నాథరావు మంగళవారం పరిశీలించారు. అత్యవసర సమయంలో వినియోగించే పరికరాలు పనితీరును, ఎమర్జెన్సీ మందుల రికార్డును, డ్యూటీ ఛార్ట్‌ను పరిశీలించారు. మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఇఎంటి కె.వి.రమణ, పైలట్ చిరంజీవి పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కవిటి : వ్యక్తిగత పరిశుభ్రతతోనే పరిశుభ్రమైన ఆరోగ్యం సాధ్యమని అంగన్వాడీ సూపర్‌వైజర్ పల్లవి అన్నారు. ప్రపంచ పరిశుభ్రతా వారోత్సవాలు, రుతు పరిశుభ్రత దినోత్సవంలో భాగంగా మండలంలోని బట్టివానిపాలెంలో మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలు రుతుక్రమం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు వివరించారు. పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

వజ్రపుకొత్తూరు: కిశోర బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అక్కుపల్లి సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ యు.లత అన్నారు. మండలంలోని బైపల్లిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

ఇచ్ఛాపురం : కిశోర బాలికలు పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకోవాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి నాగారాణి సూచించారు. రుతుస్రవం, వ్యక్తిగత శుభ్రపై అవగాహన కల్పించారు.

108 సిబ్బందికి శిక్షణ

పలాస : స్థానిక సామాజిక ఆస్పత్రి ఆవరణలో 108 సిబ్బందికి మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. నూతన పోకడలకు అనుగుణంగా జిల్లా ఎఇఎంఎస్, పలాస ఇఒ జగన్ పర్యవేక్షణలో ఒజెటి నెయ్యిల కృష్ణ శిక్షణ ఇచ్చారు. గుండె ఆరోగ్య సమస్యలు, వాటి నివారణ, ఆపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తులకు సిపిఆర్ చేయు విధానం, ట్రోమ ఎమర్జెన్సీస్, ఎయిర్ వే మేనేజ్‌మెంట్, 108 ఉండే పరికరాలు, మందులు వాటి ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు.

వికలాంగులను గుర్తించాలి

టెక్కలి : సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వికలాంగుల పిల్లలను గుర్తించడంలో జాప్యం వహించవద్దని ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావులు అన్నారు. మండలంలోని అయోధ్యపురం, నర్సింగపల్లి క్లస్టర్ పరిధిలో వికలాంగ పిల్లల గుర్తింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వికలాంగులకు విద్య అందించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఐఇడి కో-ఆర్డినేటర్ అట్టాడ మన్మథరావు, ఎం.ధనుంజయరావు పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని దిమిలాడ, లక్కీదాసుపురం గ్రామాల్లో సర్వ శిక్షా అభియాన్ ఆధ్వర్యాన మండల ఐఆర్‌పి ఉపాధ్యాయులు పి.రాణి, బి.రామారావు వికలాంగ పిల్లలను గుర్తించారు. కార్యక్రమంలో విఆర్ఒ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఇచ్ఛాపురం: మండలంలో పాయతారి పంచాయతీలో మహిళ సంఘాలకు నవధాన్యాలు గురించి వివరిస్తూ, ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యతను వెలుగు ఎపిఎం ప్రసాదరావు మంగళవారం అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు ఉపయోగించడం వల్ల వచ్చే ఉపయోగాలు, భూసారాన్ని పెంచేవిధంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెళకువలు గురించి ఎఫ్‌పిజి సంఘ సభ్యులకు, గ్రామ సంఘ సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిసి మోహనరావు, విఒఎ మోహిని, సిఆర్‌పి కుమారి పాల్గొన్నారు.

'డిఎస్‌ఆర్'పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పొందూరు: మండలంలోని రాపాకలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన డ్రై డిఎస్‌ఆర్ పద్ధతిలో వరి విత్తనాలను నాటడంపై ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిఎస్‌ఆర్ పద్ధతిలో సీడ్రిల్ ద్వారా వరి విత్తనాలను నాటడం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు నీరూ ఆదా అవుతుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తలు పి.శ్రీను, రవికుమార్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దు

సిఐ దివాకర్ యాదవ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రశాంత వాతావరణంలో ఉన్న పల్లెలలో రాజకీయ దురుద్దేశాలతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.దివాకర్ యాదవ్ అన్నారు. మండలంలోని కొర్లకోటలో ఎస్ఐ కె.వెంకటేష్ అధ్యక్షలన ఇసి నిబంధనలు, చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు వస్తుంటాయని, వెళుతుంటాయని, కానీజ జీవితాంతం కలిసి మెలిసి ఉండాల్సిన ప్రజలు చిన్నపాటి మనస్పర్ధలతో వివాదాలు కొనితెచ్చుకొని జీవితాలు నాశనం చేసుకోవద్దని అన్నారు. ముఖ్యంగా ఎన్నికల సంఘ నిబంధనలు మేరకు ఫలితాల రోజున బాణసంచా పేలుళ్ళ, ర్యాలీలు, ఊరేగింపులకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. వచ్చే నెల 6 వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ దివాకర్ యాదవ్

కంట్రోల్ పాయింట్ ఏర్పాటు

ఇచ్ఛాపురం : వచ్చే నెల 4న ఎన్నికల ఫలితాలు సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు జూన్ 2 నుంచి 6వ వరకు 24ఇంటు7 కంట్రోల్ పాయింట్ చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్‌దొర ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ అదేశాలు మేరకు ఫలితాలు వెల్లడి సందర్భంగా ఎక్కడా ఎటువంటి చిన్న ఘర్షణలు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నియోజకవర్గంలో ఎక్కడైనా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తే వెంటనే కంట్రోల్ పాయింట్‌లో ఈ నంబరు 91141153 63కు ఫిర్యాదు చేయాలన్నారు. నియోజకవర్గంలోని సచివాలయం మహిళా పోలీసు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అందించాల న్నారు. వచ్చే 6 వరకు 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు.

వివాదాల జోలికి పోవద్దు

ఆమదాలవలస : వివాదాల జోలికి పోయి కేసుల్లో ఇరుక్కోవద్దని ఎస్ఐ కె.వెంకటేష్ ప్రజలకు సూచించారు. పురపాలక సంఘంలోని మెట్టెక్కి వలసలోని కుప్పిలివారి వీధిలో పోలీసు సిబ్బందితో కలిసి మంగళవారం కార్డాన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా పలు గృహాల వద్ద ఉన్న ద్విచక్ర వాహనాలను గుర్తించారు. యజమానుల నుంచి పత్రాలను అడిగి పరిశీలించారు. ఎటువంటి పత్రాలు లేని నాలుగు ద్విచక్ర వాహనాలకు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు వాహనానికి సంబంధించిన పత్రాలు అన్ని సరిచూసుకొని కొనుగోలు చేయాలన్నారు. ద్విచక్ర వాహనాలు మైనర్లకు ఇవ్వకూడదన్నారు

వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఎన్నికల వివాదాల్లో తలదూర్చి కేసుల్లో ఇరుక్కొని విలువైన కాలాన్ని జీవితాన్ని నాశ నం చేసుకోవద్దన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

బడి బస్సుల నాణ్యతపై దృష్టిపెట్టాలి

నరసన్నపేట : జిల్లాలో కొన్ని రోజుల తర్వాత పాఠశాలలు తెరిచిన నేపథ్యంలో ప్రయివేటు స్కూళ్ల బస్సుల సామర్థ్య పరీక్షలు అధికారులు నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు కోరారు. నరసన్నపేట కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు తరలించే బస్సుల్లో భద్రత ఎంతవరకు ఉన్నదో, వాటి యొక్క సామర్థ్య పరీక్షలు ఎంతవరకు నిర్వహిస్తున్నారో, వాహన చోదకులకు కౌన్సెలింగ్ లాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్కూళ్ల బస్సుల సామర్థ్యంపై, వాటి నిర్వహణపై యాజమాన్యాలు శ్రద్ధ చూపించడం లేదన్నారు. స్పీడ్ లాక్ సిస్టంను, ప్రథమ చికిత్స పెట్టె, బస్సు ఎక్కేందుకు విద్యార్థులకు సహకరించేందుకు సహాయకులు విషయాలను పరిశీలించి అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి నెయ్యల సాంబశివరాజు, రుద్రాక్ష, అరవింద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

లావేరు : ప్రతి విద్యార్థీ ఇస్రో గురించి తెలుసుకోవాలని రిసోర్స్‌పర్సన్ అరవెల్లి సూర్యప్రకాష్ అన్నారు. లావేరు శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ, ఇస్రో శ్రీహరికోటలో ప్రయోగాల గురించి విద్యార్థులకు వివరించారు. బెంగుళూరు కేంద్రంగా ఏర్పాటైన ఇస్రో, దేశంలోని వివిధ ప్రదేశాల్లో పరిశోధన అభివృద్ధి సౌకర్యాలు కలిగి ఉందని తెలిపారు. 1957 రష్యా మొట్టమొదటి శాటిలైట్ స్పుత్నిక్‌ను ప్రయోగించాలని చెప్పారు. 1980లో శ్రీహరి కోట నుంచి రోహిణి ఉపగ్రహాన్ని అంతరిక్షంలో విజయవంతంగా ప్రవేశపెట్టారని తెలిపారు. భారతదేశంలో ఉపగ్రహాల ప్రయోగానికి అత్యంత అనువైన ప్రదేశం శ్రీహరికోట అన్నారు. ఇది నెల్లూరు జిల్లాలో సూళ్లూరుపేట దగ్గర ఉందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు సహజ సంఖ్యలు, కారణాంకాలు తదితర వాటిపై గణిత ఉపాధ్యాయులు ఎం.జగదీశ్వరరావు వివరించారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ గ్రంథ పాలకులు వి.జి.ఎస్.శంకరరావు పాల్గొన్నారు.

పుస్తకం పఠనం పట్ల విద్యార్థులు శ్రద్ధ అవసరం.

బలగ : ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా పుస్తక, పత్రికా పఠనంపై శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను పేర్కొన్నారు. బలగ హడ్కో కాలనీలోని శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులతో ప్రముఖులు గురించి ఉపన్యాసాలు చెప్పారు. కార్యక్రమంలో సహాయకులు కె.అనిత పాల్గొన్నారు.

బలగ : మాట్లాడుతున్న విద్యార్థి

నౌపడ : విద్యార్థులు వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు వినియోగించుకోవాలని నౌపడ గ్రంథాలయాధికారి బి.రూపవతి కోరారు. విద్యార్థులకు కుర్చీలు ఆట ఆడించి, కథల పుస్తకాలను చదివించారు. కార్యక్రమంలో హెల్పర్ ప్రసాద్ పాల్గొన్నారు.